క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

సాలూరు: పాచిపెంట మండలం గురునాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి విశాఖపట్నం వారితో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా వారి ఆరోగ్యశ్రీ, ఆధార్, ఇతర గుర్తింపు కార్డులను తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు క్యాంప్ మేనేజర్ వెంకటరమణ ఫోన్ 72870 23743 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రమాదకరంగా కల్వర్టు


ప్రమాదకరంగా కల్వర్టు

పార్వతీపురం టౌన్: నర్సిపురం గ్రామంలోని చిన్నవీధిలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే కూడలి వద్ద ఇటీవల నిర్మించిన కల్వర్టు శ్లాబ్ పగిలిపోయింది. మూడు నెలలుగా కల్వర్టు మరమ్మతుల బారిన పడడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం వెంకటరాయుడుపేట, బీసీ కాలనీలకు ఆటోలు, ట్రాక్టర్లు వెళ్తున్న మార్గంలో కల్వర్టు ప్రమాదకరంగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రామాల్లో రెండు రోజులు పెన్షన్ల తనిఖీ

సీతానగరం: మండలంలో పంపిణీ చేస్తున్న పింఛన్లను సోమ, మంగళ వారాల్లో తనిఖీలు నిర్వహించడానికి అధికార సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. మండల స్థాయి అధికారులు ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు ఈ సమాచారం ఇవ్వడంతో లబ్ధిదారులకు ఆదివారం సాయంత్రం వారు సమాచారం చేరవేశారు. ఇప్పటికే పింఛన్ లబ్ధిదారులు ఎవరి పింఛన్లు పోతాయో, ఉంటాయోనని భయాందోళన చెందుతున్నారు. తొలి విడతలో ఒక్కో సచివాలయం, వార్డు స్థాయిల్లో తనిఖీలు జరుగుతాయని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

పీడీఎస్ బియ్యంతో వాహనం సీజ్


విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనం

పార్వతీపురంటౌన్: పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు విజిలెన్స్ సీఐ సతీష్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఆదివారం పార్వతీపురం మండలం చిన్నబొండపల్లి గ్రామం నుంచి ఒడిశా రాష్ట్రంలోని అలమండ బ్లాక్‌కు 2400 కేజీల పీడీఎఫ్ బియ్యాన్ని తరలిస్తుండగా వాహనాన్ని అడ్డుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు. పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వారిపై నిఘా పెట్టి ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటదుర్గాదేవి

వీరఘట్టం: వీరఘట్టం వాసుల ఇలవేల్పు కోటదుర్గమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ధర్మకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మ యాజీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని పలువురు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించి తమ వాట్సాప్ స్టేటస్‌లుగా పెట్టుకున్నారు.

అమ్మకానికి సిద్ధంగా ధాన్యం

భామిని: ఖరీఫ్ వరి కోతలు జోరందుకున్నాయి. రైతులు యంత్రాల ద్వారా కోతలు, నూర్పులు పూర్తిచేస్తున్నారు. సేకరించిన ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబెడుతున్నారు. అయితే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో ఇదే అదనుగా భావించి దళారులు రైతులను దోచుకుంటున్నారు. వాతావరణశాఖ తుఫాన్ హెచ్చరికలు జారీ చేయడంతో కళ్లాల్లో ధాన్యం నిల్వ చేయలేక దళారులు చెప్పిన ధరకే ధాన్యం విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వీలైనంత త్వరగా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్స్ దగ్గర అప్రమత్తం

- ఇష్టం వచ్చినట్టు, పద్ధతి లేకుండా ఏర్పాటు
- దగ్గరికి వెళ్లేంతవరకు కనిపించని వేగ నిరోధకాలు

బలిజిపేట:

వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు ఏర్పాటు చేసిన వేగ నిరోధకాలు ప్రమాదాలకు హేతువుల్లా మారుతున్నాయి. వాహనాలపై వెళ్లే వారికి స్పీడ్ బ్రేకర్‌ల వల్లే ప్రమాదాలు జరిగే పరిస్థితి కనిపిస్తోంది. గ్రామాల్లో ఇవి ఎక్కువగా కనిపిస్తున్నాయి. స్పీడ్‌బ్రేకర్లను ఇష్టానుసారం వేయడంతో సమస్యలు ఎదురవుతున్నాయని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్దేశిత పరిమాణంలో వాటిని వేయకపోవడం, వాటిపై తెలుపురంగు పూయకపోవడం వంటి కారణాలతో దగ్గరికి వచ్చేవరకు స్పీడ్ బ్రేకర్ కనిపించక వాహనాలపై వచ్చేవారికి ప్రమాదాలు ఎదురవుతున్నాయి.


మిర్తివలసలో ఎత్తుగా ఉన్న స్పీడ్ బ్రేకర్

ఎత్తుగా వేయడంతో..

వేగ నిరోధకాలను పలు మార్గాలలో వచ్చే వాహనాలను దృష్టిలో పెట్టుకుని నిర్దేశిత పరిమాణంలో ఏర్పాటు చేయాలి. ప్రమాణాలను దృష్టిలో పెట్టుకోకుండా ఎత్తుగా వేయడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనాలు అదుపు తప్పుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి సమయాల్లో వాహనాలపై వచ్చేవారికి ఎత్తుగా ఉండే స్పీడ్ బ్రేకర్‌లు ప్రమాదాలు జరిగేందుకు తావిస్తున్నాయి. ఆ మార్గంలో కొత్తగా వచ్చేవారికి అవి ఎక్కడ ఉన్నాయో తెలియక వాహనాలు అదుపు తప్పుతున్నాయని పలువురు చెబుతున్నారు. స్పీడ్ బ్రేకర్ ఎత్తుగా ఉండడం వల్ల ద్విచక్ర వాహన చోదకులు రోడ్డుపై బోల్తా కొడుతున్నారని పలువురు వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


జనార్దనపురం గ్రామం మార్గంలో స్పీడ్‌బ్రేకర్

తెలుపురంగు లేకపోవడమే కారణం

వేగ నిరోధకాలు వేసినప్పటి నుంచి తెల్లరంగు వేయకపోవడంతో దగ్గరికి వచ్చే వరకు అవి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అటు అధికారులు కాని, ఇటు నాయకులు కాని వాటిని పట్టించుకోకపోవడంతో వాహనచోదకులు గాయాల పాలవుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి ప్రమాణాలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన వేగ నిరోధకాలను తొలగించాలని, వాహనచోదకులకు కనిపించేవిధంగా వాటికి తెలుపురంగు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పాడవుతున్న వాహనాలు

ఎత్తుగా వేసిన వేగ నిరోధకాల వల్ల వాహనాలు పాడవుతున్నాయని వాహనచోదకులు అంటున్నారు. వాహనాలపై వస్తున్నప్పుడు అవి ఎక్కడ ఉన్నాయో తెలియకపోవడం వల్ల ఒక్కసారిగా అక్కడికి వచ్చేసరికి సడన్ బ్రేక్ వేయడమో లేక ఎత్తుగా ఉండే వాటిని ఢీకొట్టడమో జరుగుతోందని, దీనివల్ల వాహనాలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చిలకలపల్లిలో ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సాలూరు:

పట్టణంలోని అఫిషియల్ కాలనీ, శివాజీ సెంటర్, గొల్లవీధి, 6,7,8 వార్డుల్లో సుమారు రూ. 63 లక్షల విలువైన డ్రైనేజీ, రోడ్ల నిర్మాణాలకు స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం శంకుస్థాపన చేశారు. పట్టణంలో నీళ్ల లేని వార్డులకు త్వరలో పైలట్ వాటర్ స్కీమ్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. శ్యామలాంబ పండగ జాతరకు ముందుగానే పట్టణంలో అవసరమైన ప్రదేశాల్లో రోడ్లు, మరుగుదొడ్లు, మంచినీరు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ మాట్లాడుతూ, ఈ అభివృద్ధి పనులు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరయ్యాయని తెలిపారు. ఎన్నికల కోడ్ వల్ల పనులు ప్రారంభంలో జాప్యమై నేడు శంకుస్థాపనలు జరిగాయన్నారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేస్తున్న మంత్రి సంధ్యారాణి తదితరులు

ధాన్యం కొనుగోలు చేయాలి

- రైతుల విజ్ఞప్తి

సీతానగరం: మండలంలో నూర్పు చేసిన ధాన్యం రైతుల దగ్గర విక్రయానికి సిద్ధంగా ఉన్నా బీజీలు లేవని చెబుతూ ధాన్యం కొనుగోలు చేయడం లేదని పలుగ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రామవరం గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ, బాతయ్య, జె.కృష్ణమూర్తి, ఆర్.చిరంజీవులు, రెడ్డివానివలస గ్రామానికి చెందిన ఈశ్వరరావులు మాట్లాడుతూ తాము వరి చేను నూర్పు చేసి రోజులు గడుస్తున్నా రైతు సేవా కేంద్రాల నిర్వాహకులు బీజీలు లేని కారణంగా ధాన్యం కొనుగోలు చేయలేక పోతున్నామనడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కళ్లాల్లో ధాన్యం నిల్వలున్న కారణంగా రాత్రింబవళ్లు కాపాలా కాయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.


రామవరంలో కళ్లంలో ధాన్యం నిల్వలు

ఆదివాసీ హక్కులపై అవగాహన

భామిని: ఆదివాసీ గిరిజనుల హక్కులు, అధికారాల వినియోగంపై ఆదివారం అవగాహన కల్పించారు. మండలంలోని నల్లరాయిగూడలో వెలుగు అసోసియేషన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వై.హరీషా, ఫీల్డ్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు ఆదివాసీలు పొందాల్సిన పత్రాలు, పథకాల వివరాలు తెలియజేశారు. ఆధార్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఎలా పొందాలి, వాటిలో తప్పులను ఏ విధంగా సరిచేసుకోవాలి, ప్రభుత్వ పథకాలను ఎలా అందిపుచ్చుకోవాలి, తదితర అంశాలతో పాటు ఆదివాసీల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది ఉన్నారు.


ఆదివాసీలకు అవగాహన కల్పిస్తున్న వెలుగు సిబ్బంది

కోటదుర్గమ్మను దర్శించుకున్న ఈసీ మెంబర్

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మను జేఎన్‌టీయూ ఈసీ మెంబర్ బుడుమూరు రాజేష్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. దగ్గరుండి వారితో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచనాలు అందించి ఆలయ చరిత్రను వివరించారు.


వేదాశీర్వచనాలు అందిస్తున్న అర్చకులు

దేశీ వరి విత్తనాల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: దేశీయ వరి వంగడాల్లో మానవులకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఆదివారం దేశీ వరి విత్తనాలను ఒక్కొక్కరికీ రెండు కిలోల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని లక్కగూడ గ్రామానికి చెందిన రైతు పి.గోపినాథం తనకున్న వ్యవసాయ క్షేత్రంలో 14 రకాల ప్రాచీన వరి వంగడాలను సాగుచేసినట్లు చెప్పారు. దేశీయ వంగడాల సాగును ప్రోత్సహించేందుకు ఆ పంట దిగుబడిలోనుంచి విత్తనాలను సేకరించి సిబ్బందికి పంపిణీ చేసినట్లు చెప్పారు. వాటిని రైతులకు అందించి కనీసం 20 నుంచి 50 సెంట్ల విస్తీర్ణంలో సాగుచేసేలా ప్రోత్సహించాలని సూచించారు.


సిబ్బందికి దేశీయ వరి వంగడాలను అందజేస్తున్న డీపీఎం పి.షణ్ముఖరాజు

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు

తెర్లాం: విద్యార్థులు పుస్తక పఠనం చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో లైబ్రేరియన్ పుస్తక పఠనం చేయించారు. ఆ తర్వాత విద్యార్థులతో వివిధ రకాల ఆటలు ఆడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, పుస్తకాలు చదివితే అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందన్నారు. సెల్‌ఫోన్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. గ్రంథాలయానికి రోజూ వచ్చి వార్తా పత్రికలు, నీతి కథల పుస్తకాలు, మిగతా కాంపిటేటివ్ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని కోరారు.


విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

మంచు మాటున ప్రమాదం

- వేకువజామున ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం
- జాగ్రత్తలు పాటిస్తే సురక్షితంగా గమ్యం చేరవచ్చు

పాలకొండ రూరల్:

ఏజెన్సీ కలబోసి ఉన్న పాలకొండ నియోజకవర్గంలో ప్రస్తుత శీతాకాలంలో వేకువజామున పొగమంచు దట్టంగా కురుస్తోంది. చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. పల్లెలు, పట్టణంపై ఉదయం 8 గంటల వరకూ మంచు దుప్పటి కప్పేస్తోంది. అలాగే సాయంత్రం 5.30 గంటలకు చీకటి పడటంతో పాటు చలి ప్రారంభం అవుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే రహదారులు అంతంత మాత్రంగా ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ రోడ్లు, పల్లె కూడళ్ల వద్ద భారీ మలుపులు, ప్రధాన రహదారులకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలతో సమస్య మరింత జటిలమయ్యింది. మంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించే పరిస్థితి లేకపోవటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల సీతంపేట రహదారిలో రెండు ద్విచక్ర వాహనాలు ఇదేస్థితిలో పరస్పరం ఢీకొన్నాయి. వాహన చోదకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ క్రమంలో పోలీసులు వాహనచోదకుల భద్రతను దృష్టిలో పెట్టుకుని పలు సూచనలు చేస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో నాలుగు మండలాలకు వెళ్లే రహదారులు అనేక మలుపులతో కూడి ఉండటంతో మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.


పాలకొండ-సీతంపేట రహదారిలో కురుస్తున్న మంచు

ప్రమాద ఘంటికలు..

- దట్టంగా మంచు కమ్ముకోవటం వల్ల వాహనదారులు రహదారిని అంచనా వేయలేరు. దారి సరిగ్గా కనిపించదు.
- వాహనాలు వేగంగా నడిపే క్రమంలో మంచు ప్రభావంతో అదుపుతప్పే అవకాశం ఉంది.
- కొందరు ప్రధాన రహదారిపై వాహనాలు నిలుపుదల చేస్తుంటారు. అదే మార్గంలో వచ్చే వాహన చోదకులు పొగమంచు కారణంగా వాటిని గుర్తించలేక ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి.
- భారీ వాహనాలు (లారీలు, వ్యాన్‌లు, బస్సులు) రోడ్డు పక్కనే నిలుపుదల చేయడం సరికాదు.
- దూర ప్రయాణాలు చేసే డ్రైవర్లు సరైన విశ్రాంతి, నిద్ర లేక వేకువజామున వాహనాలు నడిపే క్రమంతో శీతల గాలులకు కునుకుపట్టి వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం



ప్రస్తుత సీజన్‌లో పొగమంచు కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికం. ఈ క్రమంలో సర్కిల్ పరిధిలో నిత్యం వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నాం. మా సిబ్బంది మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులకు రేడియం స్టిక్కర్లు వేయిస్తున్నారు. వాహన తనిఖీల్లో భాగంగా మంచు వల్ల ఎదురయ్యే సమస్యలను వాహన చోదకులకు వివరిస్తున్నాం. ముఖ్యంగా ఆటోలు, వ్యాన్‌లు నడిపేవారు అధిక లోడు, పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వరాదు. మితిమీరిన వేగం అనర్థదాయకం. సీట్ బెల్ట్, హెల్మెట్లు వాడటం శ్రేయస్కరం.

– మీసాల చంద్రమౌళి, సీఐ, పాలకొండ

పాటించాల్సిన జాగ్రత్తలు

- మంచు తీవ్రత అధికంగా ఉంటే ఆ ప్రభావం తగ్గే వరకూ ప్రయాణం వాయిదా వేసుకోవాలి.
- ప్రయాణ సమయంలో మంచు తీవ్రత అధికమై రహదారి కనిపించకుంటే సురక్షిత ప్రాంతంలో వాహనాలు నిలుపుదల చేయాలి.
- మంచు కురిసే సమయంలో వాహనాలు నెమ్మదిగా నడపాలి. ఎదురుగా వచ్చే వాహనచోదకులు గుర్తించేలా వాహన హెడ్‌లైట్స్ ఆన్, ఆఫ్ చేయటం లేదా పూర్తిగా ఆన్‌లో ఉంచటం శ్రేయస్కరం.
- వేకువ జామున కచ్చితంగా ప్రయాణించే కూరగాయలు, పాలు, వాటర్ ట్యాంకులు, వార్త పత్రికలు, భవన నిర్మాణ, వ్యవసాయ, ఉపాధి వేతనదారులను తరలించే వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలు, ప్రైవేటు బస్సులు, వ్యాన్‌లు కచ్చితంగా వాహనం ముందు, వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు అతికించాలి.
- ప్రయాణ సమయంలో వాహనం బ్రేక్, సైడ్ ఇండికేటర్లు(కుడి, ఎడమలు స్పష్టం చేసే సిగ్నల్ లైట్లు) సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలి. ముఖ్యంగా రోడ్డు మలుపుల వద్ద ఈ సిగ్నల్ లైట్స్ ఎదుటి వాహనదారులను అప్రమత్తం చేస్తాయి.
- మంచు కురుస్తున్న సమయంలో ముందు వాహనాన్ని అధిగమించే యత్నం చేయకూడదు.
- మంచు కారణంగా రోడ్డుపై చెమ్మ చేరి రహదారులు తడిగా ఉంటాయి. ఈ క్రమంలో దిచక్ర వాహనచోదకులు సడన్ బ్రేక్ వేస్తే వాహనం అదుపుతప్పే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో వాహనాన్ని నెమ్మదిగా పోనివ్వాలి.
- ముఖ్యంగా వాహన చోదకులు సిగ్నల్స్ లైట్ విధిగా ఉపయోగిస్తూ సహచర వాహన చోదకులకు సహకరించాలి.
- ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్, కారు, వ్యాన్ తదితర వాహన చోదకులు సీట్ బెల్ట్ పెట్టుకోవటం మంచిదని గుర్తించాలి.


స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉదయం 6.30 గంటల సమయంలో కురుస్తున్న పొగమంచు

మిరప సాగులో సస్యరక్షణ

- మంచు ప్రభావంతో తెగుళ్లు సోకే అవకాశం
- సస్యరక్షణ చేపట్టకపోతే దిగుబడిపై ప్రభావం


మిరపపంట

పాలకొండ రూరల్: పొగమంచు కారణంగా రబీలో సాగు చేసే మిరప పంటకు తెగుళ్లు సోకే అవకాశం ఉందని, రైతులు సరైన సస్యరక్షణ పద్ధతులు పాటించాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి సూచిస్తున్నారు. డిసెంబర్, జనవరి నెలల్లో కురిసే తేనెమంచు వల్ల మిరప పంటలో కాండం, కాయకుళ్లు తెగుళ్లతో పాటు సూక్ష్మ, స్థూల పోషకాల లోప లక్షణాలు కనిపిస్తాయి. వాటిని సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. లేదంటే పూత, పిందెలు రాలిపోయి దిగుబడి తగ్గిపోతుందన్నారు.

సూక్ష్మపోషక లోపాలు..

సూక్ష్మపోషకాలు మొక్క ఎదుగుదలకు ఎంతో అవసరం. వీటి లోపం వల్ల మొక్కల్లో ఎదుగుదల నిలిచిపోతుంది. దీని ప్రభావం దిగుబడిపై పడుతుంది. సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించినపుడు జింక్, ఐరన్ తగ్గినట్లు భావించి లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున ఫార్ములా-6ను కలిపి ఏడు రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాల్సి ఉంటుంది. అలాగే లోపాలున్న కాయల నివారణ కోసం కాల్షియం నైట్రేట్ 5 గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేస్తే పంట ఏపుగా పెరిగేందుకు అవకాశం ఉంటుంది.

తెగుళ్ల నివారణ ఇలా..

- ప్రస్తుత సీజన్‌లో మిరపకు తలమాడు తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. దీని నివారణకు ఒక మిల్లీలీటరు ప్రాపికొనజాల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుంది.
- తామర పురుగు, తేనెబంక పురుగు నివారణకు ఫ్రిపోనిల్ లేదా రోగార్ మందును 2 మిల్లీలు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.
- లద్దిపురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంబోయేట్ 100 గ్రాములు లేదా కొరజాన్ 60 మిల్లీలు లేక ఫేమ్ 35 గ్రాములు 200 లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తద్వారా తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చు.
- నల్లిపురుగు వలన ఆకుముడత తెగులు సోకుతుంది. దీని నివారణకు సల్ఫర్ 2.5 గ్రాములు, ఒబెరాన్ లేదా ఒమైక్ రెండు మిల్లీలు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.
- కాండం, కాయకుళ్లు లేదా ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు కుమాన్-ఎల్ 3 మి.లీ లేదా ఆంత్రాకాల్ 2.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- బూడిద తెగులు నివారణకు స్కోర్ ఒక మిల్లీలీటరు లేదా కాలిగ్జిన్ 1 మిల్లీలీటరు మందును లీటరు నీటిలో కలిపి పిచకారి చేయవచ్చు.
- వైరస్ తెగులు లేదా కుచ్చు తెగులు, రసం పీల్చే పురుగును అరికట్టేందుకు ఇమిడాక్లోప్రిడ్ మూడు మిల్లీలు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మరిన్ని సలహాలకు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆశాజనకంగా అపరాల సాగు

పాలకొండ: ఈ ఏడాది రబీలో అపరాల సాగు ఆశాజనకంగా ఉంది. ఇప్పటికే వరి కోతలు పూర్తి చేసిన రైతులు అపరాల సాగును చేపట్టారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో అపరాల పంటలకు అనుకూల వాతావరణం నెలకొంది. ప్రస్తుతం పంటలు పచ్చగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది రబీలో మండల వ్యాప్తంగా సుమారు 15 వేల ఎకరాల్లో అపరాల పంటలను సాగుచేస్తున్నారు.